అద్దె ఇంట్లో గురుకుల పాఠశాల

- వసతులు లేక ఇబ్బందులకు గురవుతున్న విద్యార్థినులు
- మైదానం లేక క్రీడలకూ దూరం
- అద్దె భవనానికి 9 ఏళ్లలో రూ.కోటిన్నరకు పైన చెల్లింపు


పిట్లంలో అద్దె ఇంట్లో కొనసాగుతున్న జ్యోతీబా పూలే గురుకుల బాలికల పాఠశాల


భోజనం కోసం ఎండలో నిల్చున్న విద్యార్థినులు

పిట్లం(జుక్కల్): మండల కేంద్రంలోని జ్యోతీబా పూలే గురుకుల బాలికల పాఠశాల 9 ఏళ్లుగా అద్దె భవనంలోనే నిర్వహిస్తున్నారు. ఈ పాఠశాలలో పూర్తి వసతులు లేకపోవడంతో విద్యార్థినులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. పాఠశాలకు మైదానం సైతం లేకపోవడంతో క్రీడలకూ దూరమవుతున్నారు. పాఠశాలను అద్దె భవనంలో నిర్వహిస్తున్నందుకు 9 సంవత్సరాలకు గాను సుమారు రూ.కోటి 60 లక్షలు చెల్లించారు. ఇంత మొత్తంలో అద్దె చెల్లించిన విద్యార్థినులకు పూర్తి సౌకర్యాలు, క్రీడా మైదానం లేదు. పాఠశాల ముందు సీసీ రోడ్డు లేకపోవడం వల్ల వర్షం కురిసినప్పుడు పాఠశాల ఆవరణ చిత్తడిగా మారుతోంది. అదే విధంగా పాఠశాలకు ప్రహరీ కూడా లేదు. పాఠశాల భవనానికి ఎదురుగా చెరువు, కుంట ఉండడంతో దుర్గంధంతో పాటు, దోమల బెడద ఎక్కువగా ఉంది. ఈ పాఠశాలలో 560 మంది విద్యార్థినులు చదువుకుంటున్నారు. ఇంత మంది విద్యార్థులు చదువుతున్నా వారికి సరిపడా ప్రభుత్వ భవనం లేక అద్దె భవనంలో ఇబ్బందులు పడుతూ చదువుకుంటున్నారు. పాఠశాలలో వంట గది పాఠశాల బయట చిన్న రేకుల షెడ్‌లో ఉండడంతో భోజనం కోసం విద్యార్థినులు ఎండలో లైన్‌లో నిలబడాల్సి వస్తోంది. పూర్తి వసతులు లేని పాఠశాల భవనానికి అద్దె రూపంలో ఇప్పటి వరకు చెల్లించిన డబ్బులతో నూతన భవనం నిర్మించవచ్చని, కాని ఇప్పటి వరకు ఎవరూ స్పందించడం లేదని విద్యార్థినులు తల్లిదండ్రులు అంటున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి పాఠశాల కోసం అన్ని వసతులతో ప్రభుత్వం శాశ్వత భవనం నిర్మించాలని వారు కోరుతున్నారు.

సొంత భవనం నిర్మిస్తే బాగుంటుంది



నాది ఎడపల్లి మండలం. నా కూతుర్లు ఇద్దరూ ఇదే పాఠశాలలో చదువుతున్నారు. పాఠశాలకు సొంత భవనం, మైదానం లేక విద్యార్థినులు ఇబ్బంది పడుతున్నారు. పిల్లలకు చదువుతో పాటు క్రీడలూ చాలా అవసరం. అలాంటి మైదానం లేకపోవడంతో పిల్లలు క్రీడలకు దూరం అవుతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి అన్ని వసతులతో సొంత భవనం నిర్మిస్తే బాగుంటుంది.

– గంగాధర్, విద్యార్థిని తండ్రి, ఎడపల్లి

ప్రహరీ లేకపోవడంతో భయమేస్తోంది



నా మనమరాలు ఈ పాఠశాలలో 5వ తరగతి నుంచి చదువుతోంది. ప్రస్తుతం పదవ తరగతి చదువుతోంది. పాఠశాల ఎదురుగా కుంట ఉండడంతో పాటు పాఠశాలకు ప్రహరీ లేకపోవడంతో పిల్లల గురించే భయంగా ఉంటుంది. పాఠశాలకు కనీసం ప్రహరీ ఉన్నా పిల్లలు భద్రంగా ఉన్నారని ఒక ధైర్యం ఉంటుంది. అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి అన్ని వసతులతో కూడిన సొంత భవనం నిర్మించాలి.

– నారాయణ, విద్యార్థిని తాత, కుర్తి

క్లుప్తంగా

రైస్ మిల్లుల తనిఖీ



బిచ్కుంద(జుక్కల్): మండల కేంద్రంలో బుధవారం రెవెన్యూ, పోలీస్, వ్యవసాయ శాఖ అధికారులు రైస్ మిల్లులను సంయుక్తంగా తనిఖీ చేశారు. ఇతర పరిశ్రమలకు యూరియా వాడుతున్నారని ఫిర్యాదు మేరకు కలెక్టర్ ఆదేశాల మేరకు మిల్లులలో తనిఖీలు చేశామని తహసీల్దార్ వేణుగోపాల్ తెలిపారు. యూరియా, డీఏపీ మందులు కొరత సృష్టించి ఎక్కడైనా స్టాక్ నిలువ చేసినట్లు ఉంటే రైతులు అధికారులకు సమాచారం అందించాలని, వారి పేర్లు గోప్యంగా ఉంచుతామని అన్నారు. ఎస్సై మోహన్‌రెడ్డి, ఏవో అమర్ ప్రసాద్ పాల్గొన్నారు.

స్నేహితుడి కుటుంబానికి బాసట



బీబీపేట: ఒకప్పుడు వారితో పాటు చదువుకొని కుటుంబ బాధ్యతలు మోస్తున్న తరుణంలో అనారోగ్యం పాలై మృతి చెందిన మిత్రుడి కుటుంబానికి స్నేహితులు బాసటగా నిలిచారు. వివరాలు.. మండల కేంద్రానికి చెందిన మంగళి యాదగిరి ఇటీవల అనారోగ్యానికి గురై మృతి చెందాడు. ఆయనకి ముగ్గురు కూతుళ్లు, ఒక కుమారుడు ఉండటంతో 1992–93లో యాదగిరితో చదువుకున్న మిత్రుడు సాఫ్ట్‌వేర్ ఉద్యోగి పురుషోత్తం రావు రూ.లక్ష నగదు అందజేశారు. అంతే కాకుండా మిగతా మిత్రులు అందరూ కలిసి రూ.48 వేలను అందజేశారు. అంతేకాకుండా ముమ్ముందు కూడా సహాయ సహకారాలు అందిస్తామని కుటుంబానికి ధైర్యం చెప్పారు.

చెట్లు నరుకుతున్న వారిపై చర్యలు తీసుకోవాలి



ఎల్లారెడ్డిరూరల్: జంగమాయిపల్లి శివారులో అక్రమంగా చెట్లను నరికివేసిన వారిపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరారు. ప్రధాన రహదారి పక్కన గుర్తుతెలియని వ్యక్తులు చెట్లను నరికి వేస్తూ, నరికి వేసిన కొమ్మలను రహదారిపై పడవేస్తూ వాహనదారుల రాకపోకలకు ఇబ్బందులు కలిగిస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

చంద్రశేఖర్ ఆజాద్‌కు నివాళి



బిచ్కుంద(జుక్కల్): మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాల(ఎస్సీవాడ)లో బుధవారం చంద్రశేఖర్ ఆజాద్, బాల గంగాధర్ తిలక్ జయంతి నిర్వహించారు. వారి చిత్రపటాలకు పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఎంపీడీవో గోపాల్, ఉపాధ్యాయులు రచ్చ శివకాంత్, రాజ్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ.. దేశ స్వాతంత్ర్యం కోసం వారు ప్రాణాలకు లెక్క చేయకుండా బ్రిటీష్ పాలకులకు వ్యతిరేకంగా పోరాటం చేశారని గుర్తు చేశారు.

ప్రజా సంక్షేమానికి ప్రజాపాలన



నిజాంసాగర్(జుక్కల్): ప్రజా సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రజల వద్దకు ప్రజాపాలనను తీసుకొచ్చిందని పిట్లం మార్కెట్ కమిటీ చైర్మన్ చీకోటి మనోజ్ కుమార్ అన్నారు. బుధవారం నిజాంసాగర్, మహమ్మద్‌నగర్ మండలాల్లోని మంగ్లూర్, నర్సింగ్‌రావ్‌పల్లి, ముగ్దుంపూర్ గ్రామాల్లో కాంగ్రెస్ నాయకులు, తహసీల్దార్ కొత్త రేషన్ కార్డులను పంపిణీ చేశారు. ఆయా మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మల్లికార్జున్, రవీందర్‌రెడ్డి నాయకులు అజయ్‌కుమార్, దత్తు, తహసీల్దార్లు భిక్షపతి, సవాయిసింగ్ ఉన్నారు.

కాటేపల్లి, కాస్లాబాద్ గ్రామాల్లో..

పెద్దకొడప్‌గల్(జుక్కల్): కాటేపల్లి ,కాస్లాబాద్ గ్రామాల్లో నూతన రేషన్ కార్డ్‌లను మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మహేందర్ రెడ్డి పంపిణీ చేశారు. కాంగ్రెస్ నాయకులు మొహిద్దిన్ పటేల్, మల్లప్ప పటేల్, గంగాగౌడ్, హైమద్ తదితరులు పాల్గొన్నారు.

పిట్లం(జుక్కల్): రాంపూర్ జీపీ కార్యాలయం వద్ద బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో లబ్ధిదారులకు నూతన రేషన్ కార్డులను పంపిణీ చేశారు. బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మందాడి బలరాం రెడ్డి, జీపీ కార్యదర్శి భాస్కర్, నాయకులు మేంగారం లక్ష్మయ్య, కాటేపల్లి రాజు, లింగారెడ్డి, జలంధర్ గౌడ్, జంబూ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కృత్రిమ కొరత సృష్టిస్తే కఠిన చర్యలు


దోమకొండలోని కోళ్ల దాణా పరిశ్రమలో తనిఖీలు చేస్తున్న అధికారులు


స్టాక్‌బోర్డును పరిశీలిస్తున్న ఎల్లారెడ్డి ఏడీఏ సుధామాధురి

దోమకొండ: యూరియా కృత్రిమ కొరత సృష్టిస్తే కఠిన చర్యలు ఉంటాయని అధికారులు హెచ్చరించారు. బుధవారం మండల కేంద్రంలోని పలు రైస్‌మిల్లులు, కోళ్ల దాణా పరిశ్రమలను అధికారులు ఆకస్మికంగా తనిఖీ చేశారు. తహసీల్దార్ సుధాకర్, ఎస్సై స్రవంతి, మండల వ్యవసాయాధికారి మణిదీపిక తదితరులు తనిఖీల్లో పాల్గొన్నారు. అనంతరం వారు మాట్లాడారు. కలెక్టర్ ఆదేశాల మేరకు తనిఖీలు చేశామన్నారు. వ్యవసాయానికి వాడాల్సిన యూరియా ఇతర పరిశ్రమ అవసరాలకు వాడుతున్నారన్న ఫిర్యాదు మేరకు కలెక్టర్ ఆదేశాలతో వ్యవసాయ రెవెన్యూ, పోలీసు శాఖ అధికారులకు తనిఖీలు నిర్వహించాల్సిందిగా ఆదేశించారన్నారు. తమ తనిఖీల్లో ఎలాంటి వ్యవసాయ సంబంధ యూరియా వాడటం లేదని తేలిందన్నారు.

స్టాక్ బోర్డులను ఏర్పాటు చేయాలి

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): ఫర్టిలైజర్ దుకాణాల్లో తప్పనిసరిగా నోటీస్ బోర్డులను ఏర్పాటు చేయాలని ఎల్లారెడ్డి ఏడీఏ సుధా మాధురి సూచించారు. మండల కేంద్రంలోని పలు ఫర్టిలైజర్ దుకాణాలతోపాటు మాల్తుమ్మెద, తాండూర్ సొసైటీ కార్యాలయాలను బుధవా రం ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా దుకాణాల్లో నిల్వ ఉన్న స్టాక్‌తో పాటు స్టాక్ రిజిస్టర్లను ఆమె పరిశీలించారు. ఏవో సాయికిరణ్, మాల్తుమ్మెద సొసైటీ చైర్మన్ నర్సింలు, తాండూర్ సొసైటీ సీఈవో మురళీ ఉన్నారు.

అక్రమంగా యూరియా నిల్వచేస్తే చర్యలు

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): రైస్‌మిల్లులో అక్రమంగా యూరియాను నిల్వ చేస్తే కఠినచర్యలు తీసుకుంటామని నాగిరెడ్డిపేట తహసీల్దార్ శ్రీనివాసరావు హెచ్చరించారు. నాగిరెడ్డిపేట మండలంలోని పలు రైస్‌మిల్లులను బుధవారం ఏవో సాయికిరణ్‌తో కలిసి తనిఖీ చేశారు. ఆయనవెంట ఆర్‌ఐ మహ్మద్ ఉన్నారు.

నిజాంసాగర్(జుక్కల్): మహమ్మద్‌నగర్ మండల కేంద్రంతో పాటు గాలిపూర్, కొమ్మలంచ గ్రామాల్లోని ప్రైవేట్ ఫర్టిలైజర్ షాపులను స్థానిక తహసీల్దార్ సవాయి సింగ్, ఏవో నవ్య ఆకస్మికంగా తనిఖీ చేశారు. యూరియాను పంటల అవసరాలకు కాకుండా ఇతరత్రా అవసరాలకు విక్రయిస్తే కఠినమైన చర్యలు తీసుకుంటామని వారు హెచ్చరించారు. అధికారులు మధుసూదన్, రేణుక ఉన్నారు.

రోడ్డు ఇలా.. వెళ్లేది ఎలా..?



దోమకొండ: మండల కేంద్రంలోని బస్టాండ్ ఎదురుగా ఉన్న సురభి క్లినిక్ కాలనీ రోడ్డు వరద నీటికి పూర్తిగా దెబ్బతింది. నాలుగు రోజుల క్రితం కురిసిన భారీ వర్షానికి కాలనీకి వెళ్లే మట్టి దారి పూర్తిగా కొట్టుకుపోయింది. దీంతో కాలనీలో ఇళ్లకు వెళ్లే వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ద్విచక్ర వాహనదారులు అదుపుతప్పి కిందపడిపోతున్నారని కాలనీవాసులు తెలిపారు. అధికారులు చొరవ తీసుకుని రోడ్డును బాగు చేయాలని కోరుతున్నారు.

చెత్త తొలగింపు



సాక్షి ఎఫెక్ట్..

ఎల్లారెడ్డిరూరల్: ఎల్లారెడ్డి పట్టణంలో ఎక్కడి చెత్త అక్కడే అన్న శీర్షికన మంగళవారం సాక్షిలో వచ్చిన కథనానికి మున్సిపల్ అధికారులు స్పందించారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం, పెద్ద మసీదు, డైలీ మార్కెట్లో ఉన్న చెత్తను తొలగించారు. మున్సిపల్ కార్యాలయం పక్కన చెత్త వేస్తున్న ప్రదేశంలో మొక్కలను నాటి ఫెన్సింగ్ ఏర్పాటు చేశారు. సాక్షికి స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.

కంప్యూటర్ ఆపరేటర్లకు వేతనాలు చెల్లించాలి


వినతి పత్రం అందజేస్తున్న జీపీ కంప్యూటర్ ఆపరేటర్లు


సబ్ కలెక్టర్‌కు వినతి పత్రం అందిస్తున్న ఆపరేటర్లు

భిక్కనూరు: గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో పనిచేస్తున్న ఈ–పంచాయతీ కంప్యూటర్ ఆపరేటర్లకు గతంలో మాదిరిగానే వేతనాలను చెల్లించే విధంగా ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని కోరుతూ జిల్లా పంచాయతీ కార్యదర్శుల సంఘం జిల్లా అధ్యక్షుడు మహేశ్‌గౌడ్‌కు బుధవారం వినతి పత్రం అందజేశారు. తమ సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లాలని వారు ఆయనను కోరారు. సంఘం జిల్లా అధ్యక్షుడు శంకర్, ప్రతినిధులు నరేందర్‌రెడ్డి, వెంకటేశ్, ప్రశాంత్ అనిత, రేష్మ పాల్గొన్నారు.

సబ్ కలెక్టర్‌కు వినతి..

బాన్సువాడ: మూడు నెలలుగా జీతాలు రావడం లేదని, తమకు ఉద్యోగ ,ఆరోగ్య భద్రత కల్పించాలని కోరుతూ బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయికి బుధవారం జీపీ ఆపరేటర్లు వినతి పత్రం అందించారు. ప్రతి నెలా వేతనాలు చెల్లించాలని విన్నవించారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి

ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి, లింగంపేట, నాగిరెడ్డిపేట మండలాలకు చెందిన కంప్యూటర్ ఆపరేటర్లు తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతు వారు డీఎల్‌పీవో సురేందర్‌కు ఎల్లారెడ్డిలో వినతిపత్రం అందించారు. ఆపరేటర్లు అనిల్, కపిల్, ప్రశాంత్ తదితరులున్నారు.

'ప్రతి గ్రామంలో సీసీ రోడ్లు'



మద్నూర్(జుక్కల్): కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు చొరవతో ప్రతి గ్రామంలో సీసీ రోడ్లు నిర్మిస్తున్నామని మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ పరమేశ్ పటేల్ అన్నారు. డోంగ్లీ మండలంలోని మొగాలో బుధవారం రూ.25 లక్షల నిధులతో సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో సొసైటీ మాజీ చైర్మన్లు శివాజీ పటేల్, నగేశ్ పటేల్, మాజీ ఎంపీటీసీ దీన్‌దయాల్, ఉమాకాంత్‌పటేల్, హన్మంత్ పటేల్, యూసుఫ్ పటేల్, తదితరులున్నారు.

లండన్‌లో ఆధ్యాత్మిక ప్రచారం



కామారెడ్డి అర్బన్: శ్రీరామ కోటి జపలిఖిత ప్రచారకులు కృష్ణానందస్వామీజీ లండన్‌లో ఆధ్యాత్మిక ప్రచారం నిర్వహిస్తున్నారు. లండన్ వెళ్లిన ఆయన అక్కడి తెలుగు వారికి శ్రీరామ కోటి జపలిఖిత కార్డులను పంపిణీ చేశారు. ప్రతి రోజూ కొంత మంది తెలుగు వారికి భగవద్గీత, రామాయణ ప్రవచనాలతో పాటు శ్రీరామకోటి జపలిఖిత కార్డులు, పుస్తకాలను అందజేస్తున్నారు.

దాశరథి శత జయంతి వేడుకలు



సదాశివనగర్(ఎల్లారెడ్డి): మర్కల్ స్టేజీ వద్ద గల మహిళా గురుకుల డిగ్రీ కళాశాలలో దాశరథి కృష్ణమాచార్యుల శత జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం తెలుగు విభాగానికి చెందిన అధ్యాపకురాలు ఉదయిని దాశరథి రచనలు, పొందిన అవార్డులు గురించి విద్యార్థులకు వివరించారు. ప్రిన్సిపాల్ శోభారాణి, వైస్ ప్రిన్సిపాల్ మీనా, అధ్యాపకులు పాల్గొన్నారు.

గ్రీన్ బోర్డులు మంజూరు

బాన్సువాడ రూరల్(బాన్సువాడ): ప్రభుత్వ పాఠశాలలకు గ్రీన్ బోర్డులు మంజూరయ్యాయని ఎంఈవో నాగేశ్వర్‌రావు తెలిపారు. మండలంలోని 60 పాఠశాలలకు 170 గ్రీన్ బోర్డులు మంజూరు కాగా.. పాఠశాలలకు పంపిణీ చేసినట్లు చెప్పారు. జెడ్పీ బాలిక పాఠశాలలకు త్వరలో మరో 11 బోర్డులు రానున్నాయన్నారు.

ఇనాం భూములను పట్టా భూములుగా మార్చాలి


తాడ్వాయి తహసీల్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న రైతులు

తాడ్వాయి(ఎల్లారెడ్డి): తాడ్వాయికి చెందిన 30 మంది రైతులు తమ పూర్వీకుల నుంచి వస్తున్న ఇనాం భూములను తమపేర్లపై పట్టాలుగా మార్చాలని కోరుతూ బుధవారం తాడ్వాయి తహసీల్ కార్యాలయం ముందు నిరసన తెలిపారు. 372, 373, 374 సర్వే నంబర్లపై ఉన్న భూమిని తమపేర్లపై రిజిస్ట్రేషన్ చేయాలని డిమాండ్ చేశారు. గతంలో ఉన్న డిప్యూటీ తహసీల్దార్ వెంకటేశ్వర్లు ఈ విషయంలో స్పందించి ఆర్డీవో దృష్టికి తీసుకెళ్లడంతో అప్పటి ఆర్డీవో ఒప్పుకున్నారన్నారు.

ప్రస్తుతం ఉన్న అధికారులు తమను పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తంచేశారు. అధికారులు చొరవ తీసుకొని తమకు న్యాయం జరిగేలా చూడాలని కోరారు.

'ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి'


వినతిపత్రం అందజేస్తున్న ఉపాధ్యాయులు

కామారెడ్డి అర్బన్/రాజంపేట: ఉపాధ్యాయుల ప్రమోషన్లు, బదిలీల షెడ్యూల్‌ను తక్షణమే విడుదల చేసి ఈ నెలాఖరులోగా ప్రక్రియ పూర్తి చేయాలని, అర్హత లేని డీఈవోలను తొలగించాలని ఉపాధ్యాయ పోరాట సంఘాల కమిటీ(యూఎస్‌పీసీ) జిల్లా కన్వీనర్, యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఆకుల బాబు డిమాండ్ చేశారు. యూఎస్‌పీసీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తూ బుధవారం కామారెడ్డి తహసీల్దార్ జనార్దన్‌కు, రాజంపేట తహసీల్దార్ జానకికి వినతిపత్రాలు అందజేశారు. ప్రతి మండలానికి ఎంఈవో, డివిజన్‌కు డిప్యూటీ డీఈవో, జిల్లాకు అర్హులైన డీఈవో ఉండాలని, ఉపాధ్యాయ ఖాళీలను భర్తీ చేయాలని, కేజీబీవీ, మోడల్, గురుకులాల సమస్యలు పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. శ్రీనివాస్‌రెడ్డి, సీరడి నారాయణ, శ్యాంకుమార్, విఠల్ పాల్గొన్నారు.

ఆర్టీసీ సంబురాలు చేసుకోవడం సరికాదు


మాట్లాడుతున్న ఆటో యూనియన్ నాయకులు

కామారెడ్డి అర్బన్: మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించడంతో ఆటోలకు గిరాకీ లేక ఆటో డ్రైవర్లు ఆత్మహత్యలు పాల్పడుతుంటే ప్రభుత్వం సంబురాలు చేసుకోవడం సరికాదని ఆటో యూనియన్ల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు మంద రవికుమార్ అన్నారు. బుధవారం స్థానిక ఆర్ అండ్ బీ అతిథి గృహంలో రవికుమార్ మాట్లాడుతూ.. ఆటో కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేస్తామన్న సీఎం రేవంత్‌రెడ్డి మాట నిలబెట్టుకోవాలని కోరారు. ఉపాధి కోల్పోయిన ఆటో డ్రైవర్లకు నెలకు రూ.12 వేల భృతి ఇవ్వాలని డిమాండ్ చేశారు. మహాలక్ష్మి పథకం వచ్చిన తర్వాత రాష్ట్రంలో 87 మంది ఆటో డ్రైవర్లు ఆత్మహత్యలు చేసుకున్నారని వెల్లడించారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో తాడోపేడో తేల్చుకుంటామని హెచ్చరించారు. ప్రతినిధులు బుగుడాల సాయిలు, ఉమార్‌ఖాన్, అల్తాఫ్ పాల్గొన్నారు.

కేసీఆర్ కిట్ అందజేత


కేసీఆర్ కిట్‌ను అందజేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

గాంధారి: మండల కేంద్రానికి చెందిన తాడ్వాయి భవిత, హనుమాండ్లు దంపతులకు ఇటీవల బాబు జన్మించాడు. గత ప్రభుత్వం ఉన్నప్పుడు డెలివరీ సమయంలో కేసీఆర్ కిట్‌ను అందజేసేవారు. కానీ ఇప్పుడు కేసీఆర్ కిట్ పథకాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా రద్దు చేసిందని బాధపడుతూ బీఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు హనుమాండ్లు దంపతులు ట్విట్టర్ ద్వారా తమ బాధను వెలిబుచ్చారు. వెంటనే స్పందించిన కేటీఆర్ ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్‌తో మాట్లాడి కేసీఆర్ కిట్‌ను హనుమాండ్లు ఇంటికి పంపించారు. మండలానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు బుధవారం కేసీఆర్ కిట్‌ను హనుమాండ్లు దంపతులకు అందజేశారు. దీంతో హనుమాండ్లు దంపతులు కేటీఆర్‌కు, మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్‌కు, బీఆర్ఎస్ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

రుణాలను ఆదాయ అభివృద్ధికి వినియోగించుకోవాలి

రాజంపేట: మహిళా సంఘ సభ్యులు గ్రామ సంఘాల ద్వారా పొందిన రుణాలను ఆదాయ అభివృద్ధికి వినియోగించుకోవాలని డీపీఎం ఫామ్ సురేష్ అన్నారు. మండలంలో గ్రామ సంఘాల సమావేశం నిర్వహించి మాట్లాడారు. మహిళా సంఘ సభ్యులు సంఘం నుంచి తీసుకునే ప్రతి అప్పు కూడా ఆదాయ అభివృద్ధికి వినియోగించుకోవాలని సూచించారు. మహిళా శక్తి కార్యక్రమంలో భాగంగా చిన్న సంఘ సభ్యులకు రూ.2 లక్షల బ్యాంకు అప్పు నిలువ ఉన్నవారికి మళ్లీ నూతనంగా రుణాలు అందించడానికి సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. మండల సమాఖ్య అధ్యక్షులు లక్ష్మి, ఏపీఎం సాయిలు, సీసీలు శ్రీనివాస్, సాయిలు, భాగయ్య, రమేష్, స్వామి పాల్గొన్నారు.

సదాశివనగర్ లయన్స్ క్లబ్ అధ్యక్షుడిగా నర్సారెడ్డి

సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండల కేంద్రానికి చెందిన కొప్పుల నర్సారెడ్డి సదాశివనగర్ లయన్స్ క్లబ్‌కు రెండోసారి అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. కార్యదర్శిగా కమలాకర్ రావ్, ట్రెజరర్‌గా కోతి లింబారెడ్డి ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నర్సారెడ్డి మాట్లాడుతూ.. రెండోసారి ఎన్నుకున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు. లయన్స్ క్లబ్ జిల్లా మొదటి ఉప గవర్నర్ విజయలక్ష్మి, రెండో ఉప గవర్నర్ నరసింహరాజు, రీజనల్ చైర్ పర్సన్ అనిత, జిల్లా కో–ఆర్డినేటర్ రాజన్న, క్లబ్ ప్రతినిధులు గాదారి గంగారెడ్డి, రాజిరెడ్డి, శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.

సంక్షిప్తం

దరఖాస్తుల ఆహ్వానం

ఎల్లారెడ్డి: జాతీయ కుటుంబ ప్రయోజన పథకానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఆర్డీవో పార్థసింహారెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న కుటుంబానికి సంబంధించిన ప్రధాన పోషకుడు మృతి చెందితే వారు పథకానికి అర్హులని అన్నారు. 12 ఏప్రిల్, 2017 తర్వాత మృతి చెందిన వారు ఈ పథకానికి దరఖాస్తులు చేసుకోవాలని ఆయన కోరారు. పోషకుడి వయస్సు 18 నుంచి 59 ఏళ్ల లోపు ఉండాలని, మీ–సేవలో దరఖాస్తు చేసుకోవాలని అన్నారు. గతంలో ఆపద్బంధు, ఇతర ప్రభుత్వ పథకాల నుంచి లబ్ధిపొందిన వారు ఈ పథకానికి అనర్హులని వెల్లడించారు.

పద్మశాలి సంఘం మండల నూతన కార్యవర్గం

తాడ్వాయి(ఎల్లారెడ్డి): పద్మశాలి సంఘం తాడ్వాయి మండల నూతన కార్యవర్గాన్ని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గుర్రపు నారాయణ(నందివాడ), ప్రధాన కార్యదర్శిగా కొండరమేష్(తాడ్వాయి), కోశాధికారిగా కూడికల చంద్రం(బ్రాహ్మణపల్లి)లను ఎన్నుకున్నారు. వివిధ గ్రామాల పద్మశాలి కుల పెద్దలు పాల్గొన్నారు.

బంజార సేవా సంఘం కార్యవర్గం..

నిజాంసాగర్(జుక్కల్): మహమ్మద్‌నగర్ మండల కేంద్రంలోని సొసైటీ ఫంక్షన్ హాల్‌లో బుధవారం బంజార సేవా సంఘం మండల కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం మండలాధ్యక్షుడిగా రామావత్ గోపిసింగ్(తుంకిపల్లితండా), ఉపాధ్యక్షుడిగా నునావత్ రాములు, ప్రధాన కార్యదర్శిగా బానవత్ రాజు, జాయింట్ కార్యదర్శిగా పాత్లోత్ రాజు, కోశాధికారిగా జరుప్లా శ్రీనివాస్, ప్రచార కమిటీ సభ్యుడిగా బోడ ప్రకాష్, సలహాదారుడిగా సేవ్య, సభ్యులుగా రాములు, గంగ, తదితరులను ఎన్నుకున్నట్లు సంఘం జిల్లా నాయకులు లోక్యానాయక్, సవాయిసింగ్ తెలిపారు. కార్యవర్గాన్ని ఘనంగా సన్మానించారు.

వికలాంగుల సన్నాహక సమావేశాన్ని విజయవంతం చేయాలి

ఎల్లారెడ్డి: వికలాంగుల సన్నాహక సదస్సును విజయవంతం చేయాలని వికలాంగుల సంఘం నాయకులు అన్నారు. బుధవారం ఎల్లారెడ్డిలో వారు మాట్లాడుతూ.. ఆగస్టు 5న కామారెడ్డిలో నిర్వహించే వికలాంగుల సన్నాహక సదస్సుకు ఎమ్మార్పీఎస్ నాయకులు మందకృష్ణ మాదిగ హాజరుకానున్నట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో మంథని సామెల్ , సతీష్, పద్మారావు, శివానందం తదితరులు పాల్గొన్నారు.

మైనారిటీ కళాశాలలో విద్యార్థులకు వైద్యపరీక్షలు

కామారెడ్డి అర్బన్: దేవునిపల్లిలోని మైనారిటీ గురుకుల జూనియర్ కళాశాలలో బుధవారం విద్యార్థులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. వర్షాకాలంలో వచ్చే జబ్బుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, శుభ్రత పాటించాలని వైద్య ఆరోగ్య శాఖాధికారి సంతోష్‌కుమార్ సూచించారు. అవసరమైన వారికి మందులు అందజేశారు. కళాశాల ప్రిన్సిపల్ ఇంతియాజ్ అలీ, స్టాఫ్ నర్స్ గోపాల్, తదితరులు పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మితో పేదలకు మేలు

మద్నూర్(జుక్కల్): కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలతో పేదలకు ఎంతో మేలు జరుగుతోందని కాంగ్రెస్ పార్టీ నాయకులు పేర్కొన్నారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో బుధవారం కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను లబ్ధిదారులకు అందించారు. అలాగే పలువురికి సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను అందించారు. పార్టీ మండల అధ్యక్షుడు దరాస్ సాయిలు, మాజీ అధ్యక్షుడు పట్నాల్ రమేశ్, సలాబత్‌పూర్ ఆలయ కమిటీ చైర్మన్ రాం పటేల్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మెన్ పరమేశ్‌పటేల్ ఉన్నారు.



సాక్షి పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
బాన్సువాడ: యం. మధుసూధన్ : 9951027699
ఎల్లారెడ్డి: ఎం. శ్రీనివాస్ : 9704490298
కామారెడ్డి : కె. రాజు : 9949699861
టోల్ ఫ్రీ నెం. 1800 425 9899